క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



గుడివాడ కాలనీలో ఆవిష్కరించిన అంబేడ్కర్ విగ్రహం

బలిజిపేట: మండలంలోని పలగర గుడివాడ కాలనీలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరం పాటుపడాలని పిలుపునిచ్చారు. దళిత కుటుంబాలకు సమాజంలో ఒక గుర్తింపు తీసుకువచ్చిన గొప్ప మహానుభావుడని అటువంటి నాయకుడి ఆశయాలను ముందుకు నడిపించాలని కోరారు. కార్యక్రమంలో వేదాంత డెవలపర్స్ ప్రతినిధులు కె.సురేష్, మన్మథరావు, సీజీఎం మశిలామణి, ఎంఆర్‌పీఎస్ నాయకులు, వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్‌లో జోగింపేట ఉత్తమం

సీతానగరం: మండలంలోని జోగింపేట పంచాయతీని క్లీన్‌అండ్ గ్రీన్‌లో ఉత్తమ గ్రామ పంచాయతీగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు సోమవారం అమరావతిలో జరగనున్న పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అవార్డును బహూకరించనుందని ఈఓపీఆర్డీ కె. కుమారవర్మ తెలియజేశారు. ఈ నేపథ్యంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

మక్కువ: రెండు బైక్లు ఢీకొనడంతో ఐదుగురు గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..
మండలంలోని మూలవలస గ్రామానికి చెందిన ఎం. శ్రీనివాస్, మర్రి ప్రసాద్‌ద్విచక్ర వాహనంపై మక్కువ నుంచి మూలవలస వెళ్తున్నారు. ఇదే సమయంలో సాలూరు మండలం పట్టుచెన్నూరు గ్రామానికి చెందిన ఎస్. శంకర్, తాడంగి బెహన్, తాడంగి సుఖిల ద్విచక్ర వాహనంపై మార్కొండపుట్టి నుంచి మక్కువ వైపు వస్తున్నారు. సరిగ్గా సరేయవలస జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఐదుగురు గాయపడ్డారు. వెంటనే క్షతగాత్రులను మక్కువ పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

చలివేంద్రం ఏర్పాటు



పాదచారులకు మజ్జిగ అందజేస్తున్న యజ్ఞకర్త శర్మయాజీ

వీరఘట్టం: స్థానిక పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్ శర్మయాజీ ఆదివారం ప్రారంభించారు. వేసవిలో ఆలయానికి వచ్చే భక్తులు, ఈ మార్గంలో రాకపోకలు సాగించే బాటసారులు, వాహన చోదకుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలువురికి మజ్జిగ పంపిణీ చేశారు.

ఎస్సై ఔదార్యం



ఆర్థికసాయం చేస్తున్న ఎస్‌ఐ నీలకంఠరావు

సీతంపేట: స్థానిక ఎస్సై నీలకంఠరావు సేవా భావాన్ని చాటుకున్నారు. కొత్తూరు మండలం శోభనాపురం గ్రామానికి చెందిన గిరిజన యువకుడు కోలక ఆఫీస్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో వైద్యం కోసం తన వంతు సాయంగా రూ.10వేలు ఆదివారం అందజేశారు. గుండె ఆపరేషన్‌కు భారీగా ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి తనవంతు సాయం అందించి అండగా నిలిచారు. దాతలు ముందుకొచ్చి ఆ కుటుంబానికి సాయం అందించాలని గిరిజన సంఘం నాయకులు బి.ఉమామహేశ్వరరావు, తదితరులు కోరారు.

రైతుల సమక్షంలోనే సర్వేరాళ్ల ఏర్పాటు

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వే కార్యక్రమంలో భాగంగా సర్వే పూర్తయిన గ్రామాల్లో హద్దురాళ్ల ఏర్పాటును సకాలంలో పూర్తిచేయాలని డిప్యూటీ తహసీల్దార్ పి.సన్యాసిరావు అన్నారు. మండలంలోని లుంబూరు సచివాలయ పరిధిలో చేపడుతున్న సర్వరాళ్ల ఏర్పాటును సర్పంచ్ ఉపేంద్రకుమార్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ఎలాంటి వివాదాలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం ముఖ్యమంత్రి ఘనతే

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



వెంకంపేటలో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదల పక్షాన నిలుస్తున్నారన్నారు. పార్వతీపురం మండలంలోని వెంకంపేట గ్రామంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా ఆత్మీయ స్వాగతం పలికారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. అమ్మ ఒడి వచ్చిందా, రైతు భరోసా వచ్చిందా, పింఛన్ ఇంటివద్దకే వచ్చి ఇస్తున్నారా అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు తీరును వివరించిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అర్హులకు ఏదైనా అన్యాయం జరుగుతుందా తదితర విషయాలు తెలుసుకునేందుకే తాము వచ్చామని వివరించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సచివాలయాలు ఆయా గ్రామాల పరిధిలో ఉండడం వల్ల ప్రజలకు కూడా తమ సమస్యలను వెంటనే తెలియజేసి పరిష్కారం పొందుతున్నారని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో అందిస్తుందని తెలిపారు. సచివాలయానికి రూ.20లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించిందని, వాటి ద్వారా పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు.

ప్రతిపక్షాలవి అర్థం లేని ఆరోపణలు

ప్రతి కుటుంబానికి ఏదోఒక సంక్షేమ పథకం అందజేస్తూ పేదల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తున్న తీరును ఓర్వలేక టీడీపీ, జనసేన నాయకులు కొందరు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్న నాయకులు బాదుడే బాదుడు అంటూ మభ్యపెట్టే కార్యక్రమం చేపట్టడం విచాకరమని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, స్థానిక సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ పథకం ద్వారా చెరువుల అభివృద్ధి



సుమిత్రాపురం మంచినీటి కోనేరులో పనులు

సీతానగరం: అమృత్ సరోవర్ పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరానికి మండలంలోని 5 చెరువులు అభివృద్ధి చేయాలని ఉపాధిహామీ పథకం ఉన్నతాధికారులు నిర్ధారించారు. ఇప్పటికే లక్షలాది రూపాయల వ్యయంతో 4 చెరువుల పనులు చేపట్టారు. తాజాగా సుమిత్రాపురంలో మంచినీరు కోనేరును అమృత్ సరోవర్ పథకం ద్వారా అభివృద్ధి చేస్తున్నామని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ తెలిపారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న బైపాస్ రోడ్డు



బైపాస్ రోడ్డును ఎన్‌హెచ్ 26కు అనుసంధానం చేస్తూ చేపడుతున్న పనులు

సాలూరు: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతో సాలూరు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు దాదాపు పూర్తయి ప్రారంభానికి సిద్ధమవుతోంది. పట్టణంలోని దుగ్గిసాగరం సమీపం నుంచి జీగిరాంకు సుమారు రూ. 32 కోట్లతో చేపడుతున్న పట్టణ బైపాస్ రోడ్డు పనులు ఆఖరు దశకు చేరుకున్నాయి. రామభద్రపురం నుంచి సాలూరు వైపు వచ్చే క్రమంలో పట్టణ ప్రారంభంలో ఎన్‌హెచ్ 26కు ఈ బైపాస్‌ను అనుసంధానం చేసే పనులు జరుగుతున్నాయి. ఈ పనులు మినహా మిగిలిన పనులన్నీ పూర్తయ్యాయి. నెల రోజులోగ్గా ఈ పనులు పూర్తి చేసి అప్పగించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

ప్రవేశ పరీక్ష కేంద్రం తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్

సీతానగరం: 8వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మండలంలోని జోగింపేట గిరిజన ప్రతిభా పాఠశాల, కళాశాలలో చేరికకు నిర్వహించిన ప్రవేశ పరీక్షల కేంద్రాన్ని ఐటీడీఏ పీఓ సి విష్ణు చరణ్ ఆదివారం తనిఖీ చేశారు. 8వ తరగతి ప్రవేశ పరీక్షకు 153 మంది దరఖాస్తు చేయగా 132 మంది విద్యార్థులు హాజరయ్యారని, అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి 270 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 221 మంది హాజరయ్యారని తెలియ జేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.వెంకటినాయుడు ఉన్నారు.

ప్రశాంతంగా ప్రవేశపరీక్ష

మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన 5వ తరగతి, ఇంటర్‌మీడియట్ మొదట సంవత్సరంలో అడ్మిషన్లకు సంబంధించి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ కె.ఈశ్వరరావు తెలియజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జోగింపేట పరీక్ష కేంద్రంలో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 317మంది దరఖాస్తు చేసుకోగా 278 మంది విద్యార్థులు హాజరయ్యారని, అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశ పరీక్షకు 189మంది విద్యార్థులు హాజరు కావలసిఉండగా 152 మంది హాజరయ్యారని తెలియ జేశారు. ప్రవేశపరీక్షలో ర్యాంకుల ఆధారంగా జిల్లాలోని గురుకులాల్లో సీట్లు కేటాయిస్తారన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభాల మార్పు



అప్పయ్యపేటలో జరుగుతున్న విద్యుద్దీకరణ పనులు

సీతానగరం: మండలంలో విద్యుత్ వినియోగదారుల సేవార్థం గ్రామాల్లో పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కరిస్తున్నామని విద్యుత్ శాఖ మండల ఏఈ సోమేశ్వరరావు అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం మండలంలోని అప్పయ్యపేటలో ఇటీవల ఈదురుగాలికి తెగిన విద్యుత్ వైర్లు, స్తంభాల స్థానంలో కొత్తగా లైన్లు ఏర్పాటుచేసిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిరోజుల్లో రెండు పర్యాయాలు మండలంలో వీచిన గాలికి విరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిన విద్యుత్ వైర్లు తొలగించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే రాష్ట్ర రహదారిని ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాల ఎత్తు తగ్గి పోవడంతో స్తంభాలు మార్పు చేయడానికి చర్యలు ప్రారంభించామన్నారు. ఇప్పటికే జగనన్న కాలనీల్లో విద్యుత్ లైన్లు వేస్తున్నట్లు చెప్పారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా బాధ్యతలు



శివున్నాయుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ తప్పక తగిన గుర్తింపు లభిస్తుందని శాసన సభ్యుడు అలజంగి జోగారావు అన్నారు. పెదబొండపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా తీళ్ల శివున్నాయుడి ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన ఆదివారం హాజరయ్యారు. మండల పరిధిలో గల వెంకంపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తీళ్ల శివున్నాయుడుని పీఏసీఎస్ చైర్మన్‌గా నామినేట్ చేస్తూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు గడిచిన నెలలో రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఫలితంగా ఇటీవల నూతన చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పీఏసీఎస్ చైర్మన్‌గా బొండపల్లిలో గల కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఎమ్మెల్యే జోగారావు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ ప్రాంత ప్రజల రైతుల సంక్షేమానికి పీఏసీఎస్ చైర్మన్‌గా విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తనకు నామినేటెడ్ పదవి ఇచ్చి సముచిత గౌరవాన్ని కల్పించిన ఎమ్మెల్యేకి శివున్నాయుడు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సభ్యులు, మండల ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సహకార సంఘం అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తుమరాడ రోడ్డు మరమ్మతులు



మరమ్మతులు జరుగుతున్న రోడ్డు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి ఆర్‌అండ్‌బీ రోడ్డు తుమరాడ జంక్షన్ నుంచి గ్రామంలోకి ఉన్న బీటీ రోడ్డు మరమ్మతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే జోగారావు చొరవతో 1.4 కిలోమీటర్ల పొడవుకలిగిన రోడ్డుకు రూ.18.36లక్షల జిల్లా పరిషత్ నిధులు మంజూరు కావడంతో మరమ్మతులు చేపట్టినట్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.లక్ష్మణరావు తెలిపారు. వచ్చేనెల 8,9,10తేదీలలో తుమరాడలో శ్రీశ్రీశ్రీ పాదాలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో గ్రామంనుంచి బలిజిపేట వెళ్లేందుకు అవసరమైన బీటీరోడ్డు పూర్తిగా పాడవడంతో రానున్న రోజుల్లో ఇబ్బందులు ఎదురవుతాయని ఎమ్మెల్యే జోగారావు దృష్టికి గ్రామ నాయకులు తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి ఈ నిధులు మంజూరు చేయించినట్లు లక్ష్మణ రావు చెప్పారు.

ఇంటింటికీ 'జగనన్నే మా భవిష్యత్'



పట్టణంలోని కొత్తవలసలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకురాలు గోగు గాయత్రి

పార్వతీపురంటౌన్: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల నాయకులు ఆదివారం ఇంటింటికీ నిర్వహించారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదేశాల మేరకు గ్రామాలు, వార్డుల్లో పెద్దలతో వైఎస్సార్‌సీపీ నాయకులంతా కలిసి గడపగడపకు వెళ్లి కలిసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక చేకూరిన లబ్ధిని వారికి వివరిస్తూ గత ప్రభుత్వంలో మోసపోయిన మోసగించిన విధానాన్ని విడమరిచి తెలియజేశారు. అలాగే రెండు ప్రభుత్వాలకు మధ్య తేడాను తెలియజేసి ప్రజా మద్దతు పుస్తకంలో పొందుపరచిన ఐదు ప్రశ్నలకు అవునని సమాధానం చెప్పే రసీదులు అందించాలని కోరారు. ప్రజల మద్దతు స్వీకరిస్తూ వారి ఇంటి గోడపై జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్‌ను ఫోన్ పై అతికించారు. మళ్లీ జగన్ పరిపాలన కావాలని రావాలని ప్రజల విశ్వసించడంతో పాటుగా ప్రజలందరూ మిస్డ్ కాల్ ఇచ్చి వారి పూర్తిస్థాయి మద్దతు తెలిపారు.

నిడగల్లులో రెండో ఆర్వో ప్లాంట్ మంజూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: మండలంలోని నిడగల్లు గ్రామానికి రెండవ ఆర్వో ప్లాంట్ మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలియజేశారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీరు కోసం ఇబ్బందులు పడుతున్నామని ఇటీవలే 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం సందర్భంగా నిడగల్లు వచ్చిన సమయంలో గ్రామపెద్దలు తనదృష్టికి సమస్య తీసుకువచ్చారన్నారు. అప్పట్లో ప్రజలు గ్రామంలో నీరుతాగడం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని తనదృష్టికి తెచ్చిన నాలుగు రోజుల్లోనే గ్రామ పెద్దల సమక్షంలో ఆర్వో ప్లాంట్‌ను ఇటీవల ప్రారంభించినట్లు తెలియజేశారు. నిడగల్లు పెద్దగ్రామం కావడం వల్ల రెండవ ఆర్వో ప్లాంట్ మంజూరు చేసినట్లు చెప్పారు. గ్రామ పెద్దల సూచనల మేరకు త్వరలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తామన్నారు.

అమ్మవారి పండగకు పటిష్ట బందోబస్తు

వీరఘట్టం: మేజరు పంచాయతీ వీరఘట్టం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగలు ఈ నెల 30 నుంచి మే నెల 10వ తేదీ వరకు జరగనున్నాయి. ఏడేళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఈ పండగను ఘనంగా చేసేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. ఈ మేరకు పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ మురళీధర్, ఎస్సై కిషోర్‌వర్మ ఆదివారం అమ్మవారిని దర్శించుకుని, ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమై ఉత్సవ ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మే నెల 9న సిరిమానోత్సవం జరగనుందని, ఈ ఉత్సవానికి లక్షకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎస్ శర్మయాజీ, కమిటీ సభ్యులు తెలిపారు. ఆ సమయాల్లో కోవెల వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కోరారు. సిరిమానోత్సవం రోజు ట్రాఫిక్‌ను మళ్లించి వాహనాలు రెల్లి వీధి మీదుగా బార్నాలవీధి గుండా కొత్తబస్టాండ్‌కు చేరుకొనే విధంగా చర్యలు చేపడతామని డీఎస్పీ తెలిపారు.

త్రివిధ దళాల్లో యువత చేరేలా సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్

పార్వతీపురంటౌన్: యువత త్రివిధ దళాల్లో చేరే విధంగా తయారు చేయడంలో మాజీ సైనికులు సహకరించాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా నలుమూలలా చుట్టుపక్కల గ్రామాలలో సుమారు 1000 మంది పై చిలుకు దేశ సేవలో నిమగ్నమవడం గర్వించదగిన విషయమన్నారు. నిరుద్యోగ యువత త్రివిధ దళాల్లో చేరేందుకు అవసరమైన శిక్షణ, నైపుణ్యాన్ని అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు రంగుముద్రి శివ నరేష్ నాయుడు మాజీ సైనికుల సంక్షేమ సంఘ సభ్యులు అధ్యక్షుడు చంద్రశేఖర్, కృష్ణ ఈశ్వర్ రావు, తాడ్డి రమేష్ కైలాస రావు, సంఘం ఇతర ముఖ్య సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

జీవాల సంరక్షణలో జాగ్రత్త

- వేసవిలో వ్యాధులబారిన పడే ప్రమాదం
- వ్యాధి లక్షణాలు, నివారణపై పెంపకందారులు అవగాహన పెంచుకోవాలి
- పశువైద్యశాఖ ఏడీ ప్రభా మాణిక్యరావు

పాలకొండ రూరల్: ప్రస్తుత వేసవిలో అడపా దడపా కురిసే వర్షాల కారణంగా గొర్రెలకు సోకే వ్యాధులు, వాటి నివారణపై పెంపకందారులు అవగాహన పెంచుకోవాలని పశుసంవర్థకశాఖ ఏడీ ప్రభా మాణిక్యరావు సూచించారు. ముఖ్యంగా వివిధ రకాల క్రిమికీటకాల వల్ల ఈ వ్యాధులు సక్రమిస్తాయని, పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవిలో సోకే వ్యాధులు, నివారణపై పాడిరైతులకు పలు సూచనలు, సహాలు అందించారు.

ఈ వ్యాధులతో జాగ్రత్త

సూక్ష్మజీవుల వలన చిటుకు వ్యాధి(ఈటీ), అంత్రాక్స్ లేదా నల్లజాడ్యం, ఊపరితిత్తుల్లో నెమ్ము లేదా నెమోనియో, పొగాళ్ల లేదా బురద పుండ్లు, మితువకాళ్లు, గొంతువాపు వ్యాధుల సంక్రమిస్తాయి. గాలికుంటు, నీలి నాలిక, బొబ్బ రోగం, అమ్మతల్లి, నోటి పుండ్లు వంటివి వైరస్‌ల ద్వారా ఒకదాని నుంచి ఇంకొకదానికి చేరి మంద మొత్తానికి ముప్పువాటిల్లే ప్రమాదం ఉంది. తొలికపాటి వర్షాలు కురిసేటప్పుడు క్లాస్ట్రీడియం జాతి సూక్ష్మజీవుల వలన ఎక్కువ ప్రమాదం చోటుచేసుకుంటుంది. బలిష్టంగా, ఆరోగ్యంగా ఉండే గొర్రెలు ఒక్కసారిగా ఎగిరిపడి కొట్టుకుని మరణించడం, కడుపును కాళ్లతో తన్నడం, కడుపు ఉబ్బడం, నల్లగా దుర్వాసన వచ్చే పారుడు, నోటి నుంచి నురగ రావడం, ఫిట్స్ వంటి లక్షణాల ద్వారా ఈ రోగాలను గుర్తించవచ్చు.

నివారణ చర్యలు

వ్యాధి లక్షణాలు గుర్తించిన జీవాలకు రోగ స్థితిని బట్టి, వైద్యుల సలహామేరకు ఆక్సీట్రిటెట్ సైక్లిన్ మందును 5–10 మిల్లీగ్రాములు ఒక కిలో బరువుకు లెక్కకట్టి గొర్రెలకు అందించాలి. అలాగే 50 మిల్లీగ్రాముల పొటాషియం పర్మాంగనేట్ 100 మిల్లీలీటర్ల నీటిలో కలిపి తాగించాలి. రోగనివారణకు అవసరమగు టీకాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పశువైద్య కేంద్రాల్లో ఈ టీకాలను ఉచితంగా అందిస్తారు. మూడు మాసాల వయస్సు నిండిన గొర్రెపిల్లలకు తప్పనిసరిగా నట్టల మందు వేయించాలి. మొదటి టీకా ఇచ్చిన 15 రోజుల తరువాత బూస్టర్ డోస్ ఇవ్వాల్సి ఉంటుంది. ఏటా మే నెల మొదటి వారంలో క్రమం తప్పకుండా టీకాలు వేయించడం ద్వారా జీవాలను వ్యాధుల నుంచి సంరక్షించుకోవచ్చు.